క్లుప్తంగా

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం రెండోవార్డు కౌన్సిలర్ ఖాందేష్ సంగీత లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను తెలంగాణ రాష్ట్రంలో సీఎం అందిస్తూ పేదింటి ఆడబిడ్డలకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు ఖాందేష్ సత్యం, నరేష్, మేతాబ్‌సింగ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు..



నవీపేట: మండలంలోని మద్దెపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, బూట్లు, పెన్నులతో పాటు పాఠశాలకు బీరువాను బుధవారం సిరన్‌పల్లి సర్పంచ్ సుధాకర్‌రావు పంపిణీ చేశారు. ఆయన సతీమణి దొడ్డి భారతి వర్ధంతి సందర్భంగా అందజేశారు. నిరుపేద విద్యార్థులకు ప్రతి యేడు తనవంతు సహాయం అందిస్తున్నానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ హరీష్, గణేష్‌రావ్, నాగేపూర్ సొసైటీ మాజీ చైర్మన్ కిషన్‌రావ్, యూవీకెన్ వ్యవస్థాపకులు సుజన్‌రావు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



మోర్తాడ్: ఏర్గట్ల మండలంలోని దోంచందలో బుధవారం ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. తాళ్లరాంపూర్ సహకార సంఘం చైర్మన్ పెద్దకాపు శ్రీనివాస్‌రెడ్డి ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. 120 మందికి వైద్య పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు, మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గద్దె రాధ, ఉప సర్పంచ్ సోమిరెడ్డి శ్రీనివాస్, కంటి వైద్యులు ప్రియాంక, ప్రశాంత్, కొమిరేష్, ఐసీఐసీఐ ఫౌండేషన్ ప్రతినిధులు అఖిల, రాజేశ్, శ్రీనివాస్, మధు, సాయి పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

బాల్కొండ: వరి పంటలో సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని బాల్కొండం వ్యవసాయ అధికారి మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం వన్నెల్(బి)లో వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు వరిలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. వరిలో అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజెల్ 120 గ్రాములు లేదా ఐసోప్రతియోనేల్ 400 ఎంఎల్ 200 లీటర్లలో కలిపి ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. వరిలో మొగి పురుగు నివారణకు 4జీ గుళికలను 8 కిలోలు చల్లాలన్నారు. యూరియాను మోతాదుకు మించి వాడవద్దన్నారు.

పారిశుధ్యలోప నివారణ చర్యలు

నవీపేట: గ్రామాలలో పారిశుధ్యలోప నివారణ చర్యలను వేగవంతం చేయాలని నిజామాబాద్ డీఎల్‌పీవో నాగరాజు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాల కార్యదర్శులతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించాలని సూచించారు. పెండింగ్ కరెంట్ బిల్లులను సకాలంలో చెల్లించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీవో రామకృష్ణ పాల్గొన్నారు.

పరామర్శ



నవీపేట: మండలంలోని జన్నెపల్లిలో క్యామాజీ ప్రభాకర్ ఆకస్మికంగా మరణించడంతో వారి కుటుంబ సభ్యులను బోధన్ నియోజకవర్గ బీజేపీ నాయకులు వడ్డీ మోహన్ రెడ్డి బుధవారం పరామర్శించారు. కార్యక్రమంలో ముప్పా నాగేశ్వర్ రావు, శ్రీనివాస్‌గౌడ్, రచ్చ సుదర్శన్, నారాయణ రెడ్డి, మండల అధ్యక్షులు ఆదినాథ్, ఆంజనేయరెడ్డి, రమణరావు, సాయిలు, మల్లెపూల గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితుల ఆందోళన

- భూసేకరణ ప్రక్రియలో అవకతవకతలు సరిదిద్దాలి
- పరిహారం చెల్లింపుపై స్పష్టత ఇవ్వాలి
- బోధన్ ఆర్డీవో ఆఫీసు ఎదుట సాలూర గ్రామ భూ నిర్వాసితుల ధర్నా



బోధన్ ఆర్డీవో ఆఫీసులో అధికారికి వినతి పత్రం అందిస్తున్న నిర్వాసితులు, నేతలు

బోధన్: బోధన్-సాలూర జాతీయ రహదారి(బైపాస్ రోడ్డు) కోసం చేపట్టిన భూసేకరణ ప్రక్రియలో అవకతవకతలు వల్ల తాము నష్టపోతున్నామని సాలూర గ్రామ భూ నిర్వాసితులు ఆందోళన చేపట్టారు. తమకు జారీ చేసిన భూ సేకరణ నోటీసు ప్రకారం కాకుండా ఎక్కువ విస్తీర్ణంలో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూసేకరణకు తొలి సర్వే ప్రకారం కాకుండా మార్పులు చేసి ఎక్కువ విస్తీర్ణంలో భూమిని తీసుకుంటున్నారని ఆరోపించారు. ఇదంతా రాజకీయ నాయకుల ఒత్తిళ్ల మేరకు జరుగుతోందనే అనుమానాలు వస్తున్నాయని అన్నారు. బుధవారం బోధన్ ఆర్డీవో ఆఫీసు ఎదుట సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వాసితులు ధర్నా నిర్వహించి అనంతరం అధికారికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి పుట్ట వరదయ్య మాట్లాడుతూ.. భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం చెల్లింపు విషయంలో అధికారులు స్పష్టత ఇవ్వకుండానే పనులు మొదలు పెట్టి కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. భూ సేకరణ, సర్వే ప్రక్రియలో అవకతవకతల వల్ల సన్న ,చిన్నకారు రైతులు నష్టపోతున్నారని, పరిహారం చెల్లింపునకు రాతపూర్వకంగా ఎప్పుడు చెల్లిస్తారో స్పష్టత ఇవ్వాలని కోరారు. అప్పటి వరకు సేకరించి సాగు భూముల్లో రోడ్డు నిర్మాణ పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఆర్డీవో స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

జాతీయ రహదారి–63కు అనుసంధానంగా..

బోధన్ మండలంలోని సాలూర గ్రామానికి సరిహద్దులో ఉన్న మహారాష్ట్ర ప్రాంతంలోని నర్సి–జగదల్‌పూర్ జాతీయ రోడ్డు–63కు అనుసంధానంగా బోధన్ నుంచి సాలూర వరకు 8.3 కిలో మీటర్ల రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. ఇందులో బాగంగా నాగన్‌పల్లి, సాలూర క్యాంప్, సాలూర గ్రామాల శివారులో 4.5 కిలో మీటర్ల బైపాస్ రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ రోడ్డు విస్తరణ 10 మీటర్ల వెడల్పుతో ఉంటుంది. సాలూర రెవెన్యూ శివారులో 19 ఎకరాల 13 గుంటలు, నాగన్‌పల్లి శివారులో 7 ఎకరాల 28 గుంటల భూమిని సేకరించారు. గత ఏడాది అక్టోబర్‌లో రైతులకు భూ సేకరణ కోసం నోటీసులు జారీ చేశారు. తొలుత సాగు భూములు ఇచ్చేందుకు వ్యతిరేకించగా, బోధన్ ఆర్డీవో రాజేశ్వర్ రైతులతో అవగాహన సమావేశం నిర్వహించి ఒప్పించారు. పరిహారం చెల్లించినంతరం బైపాస్ రోడ్డు పనులు చేపట్టడం జరుగుతోందని హామీ ఇచ్చారని రైతులంటున్నారు. కానీ ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వకపోవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.

రైతులకు పరిహారం చెల్లిస్తాం



కోస్లీలో మాట్లాడుతున్న ఆర్డీవో రవి

నవీపేట: బోధన్-బాసర జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయే రైతులకు పరిహారం చెల్లిస్తామని నిజామాబాద్ ఆర్డీవో రవి సూచించారు. భూములు కోల్పోయే కోస్లీ, మిట్టాపూర్, యంచ బాధిత రైతులతో ఆయన బుధవారం వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. మూడు గ్రామాలలో 42 ఎకరాలు రోడ్డు నిర్మాణానికి అవసరమని, దీని పరిధిలోని 295 మంది రైతులు సహకరించాలని కోరారు. 9 కిలో మీటర్ల పొడవున రహదారి నిర్మాణం జరుగుతుందని సూచించారు. మూడు విడతలలో పరిహారం అందిస్తామని పేర్కొన్నారు. కొంత మంది రైతులకు ఇచ్చిన నోటీసులలో ఒక మాదిరి ఉండగా హద్దులు పరిమితికి మించి పాతారని రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. మరోమారు విచారణ జరిపిస్తామని, ఎవ్వరికి నష్టం జరుగకుండా చూస్తామన్నారు. తహసీల్దార్ వీర్‌సింగ్, వైస్ ఎంపీపీ హరీష్, రైతులు పాల్గొన్నారు.

శాశ్వతంగా నిలిచిపోయేలా పనులు చేయాలి



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నపూర్ణమ్మ

పెర్కిట్(ఆర్మూర్): పదవుల్లో ఉన్నపుడు ప్రజలకు శాశ్వతంగా గుర్తుండిపోయే పనులు చేయాలని మాజీ ఎమ్మెల్యే అన్నపూర్ణమ్మ అన్నారు. మాజీ మంత్రి ఏలేటి మహిపాల్ రెడ్డి 32వ వర్ధంతి సందర్భంగా ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి చౌరాస్తాలో ఆయన విగ్రహానికి బుధవారం పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిపాల్ రెడ్డి స్వర్గస్తులై 32 ఏళ్లు గడుస్తున్నా ప్రజల్లో ఆయనకున్న ఆదరణ ఇంకా తగ్గలేదన్నారు. మంత్రిగా మహిపాల్ రెడ్డి తండాల్లో విద్యుత్ సౌకర్యం, నీటి ఎద్దడి నివారణ, పచ్చల నడ్కుడ వాగుపై చేసిన బ్రిడ్జి నిర్మాణ పనులు ఇప్పటికీ గుర్తుంటాయన్నారు.

31వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు



దీక్షలో కూర్చున్న న్యాయవాదులు

బోధన్: బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ప్రకటించాలని డిమాండ్‌తో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరహార దీక్షలు బుధవారం నాటికి 31వ రోజుకు చేరాయి. దీక్షలో అసోసియేషన్ ప్రెసిడెంట్ గంగారెడ్డి, న్యాయవాది శంకర్, అర్జున్ రండార్‌లు కూర్చున్నారు. బోధన్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. న్యాయవాదులు, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ముప్కాల్ వీడీసీ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన వీడీసీ కార్యవర్గ సభ్యులు



బాల్కొండ మత్స్య సహకార సంఘం సభ్యులు

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్ర వీడీసీ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కంచు విజయ్, కార్యదర్శిగా అశోక్‌రెడ్డి, కోశాధికారిగా శంకర్, ఉపాధ్యక్షుడిగా స్వామి, సంయుక్త కార్యదర్శిగా కన్నయ్యలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, ముస్కు నర్సయ్య , ఆనంద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

■ **మత్స్య సహకార సంఘం కార్యవర్గం**

బాల్కొండ: బాల్కొండ మండల మత్స్య సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బట్టు ప్రవీణ్, ఉపాధ్యక్షుడిగా ఉట్నూర్ సురేశ్, కార్యదర్శిగా గణేష్, కోశాధికారిగా రాజాప్రతాప్‌లు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, శంకర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా..



దొడ్ల రవీందర్ రెడ్డి

బోధన్‌టౌన్(బోధన్): తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా దొడ్ల రవీందర్ రెడ్డి నియమితులయ్యారు. తనపై నమ్మకం ఉంచి యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షులు శివసేన రెడ్డి, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

తాళ్లరాంపూర్ మాజీ సర్పంచ్ మృతి



క్యాతం నర్సింలు

మోర్తాడ్: ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్ మాజీ సర్పంచ్, మాజీ సహకార సంఘం చైర్మన్ క్యాతం నర్సింలు(76) బుధవారం అనారోగ్యంతో మరణించారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తన నివాసంలో తుది శ్వాస విడిచారు. తాళ్లరాంపూర్ గ్రామానికి రెండుమార్లు సర్పంచ్‌గా, సహకార సంఘానికి రెండుమార్లు చైర్మన్‌గా సేవలదించారు. రాజకీయాల్లో చేరిన నాటి నుంచి చివరి వరకు టీడీపీలో కొనసాగారు. ఆయనకు భార్య, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

మహిపాల్ రెడ్డి వర్ధంతి



ముప్కాల్ శివారులో ఇటుక బట్టీల వద్ద పండ్లను పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

బాల్కొండ: మాజీ మంత్రి ఏలేటి మహిపాల్ రెడ్డి వర్ధంతిని బుధవారం బాల్కొండ, ముప్కాల్ మండల కేంద్రాల్లో బీజేపీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ముప్కాల్ మండల కేంద్ర శివారులో ఇటుక బట్టీల వద్ద పిల్లలకు, బాల్కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్, మండలాల అధ్యక్షులు అంబటి నవీన్, గిరిస్వామి, నేతలు విక్రమ్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

సమాచారం..

21న ఏకచక్రేశ్వర స్వామి జన్మదిన వేడుకలు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఏకచక్రేశ్వర స్వామి 64వ జన్మదిన వేడుకలు ఈ నెల 21న వైభవంగా నిర్వహించనున్నట్లు బుధవారం ఆలయ కార్యనిర్వహణ అధికారి రవీందర్ తెలిపారు. వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం 7 గంటల నుంచి 9 వరకు స్వామివారికి లఘు రుద్రాభిషేకం, 9 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు రుద్ర స్వాహాకారము, మధ్యాహ్నం 12:30 గంటలకు హారతి ఇస్తారని తెలిపారు.

క్యాలెండర్, డైరీల ఆవిష్కరణ



మోర్తాడ్: టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో 2023 క్యాలెండర్, డైరీలను బుధవారం మోర్తాడ్ మండల విద్యాశాఖ అధికారి ఆంధ్రయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు దండు గంగాధర్, ప్రధాన కార్యదర్శి బాలరాజు, ఉపాధ్యాయురాలు రాధిక, సీఆర్‌పీ సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

బట్టీల్లో కార్మికుల సంక్షేమం గాలికి..



ఇటుక బట్టీల వద్ద కార్మికుల కోసం ఏర్పాటు చేసిన గుడిసెలు

బాల్కొండ: ఇటుక బట్టీల్లో కార్మికుల సంక్షేమం గాలికి వదిలేస్తున్నారు. బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలో ఇష్టారీతిన ఇటుక బట్టీలను నిర్వహిస్తున్నారు. కార్మిక సంక్షేమ చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో మండలంలోని ఇత్వార్‌పేట్ శివారులో ఇటుక బట్టీలో పనిచేసే కార్మికుడు ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందాడు. ఇలా కార్మికులు ప్రమాదాల్లో చనిపోతున్న నిర్వాహకులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఇటుక బట్టీల వద్దనే గుడిసెల్లోనే నివాసం ఉంటూ కార్మికులు పనులు చేపడుతున్నారు. ఇటుక బట్టీల యజమానులు తమ కార్యాలయాల కోసం, స్టోర్ రూంల కోసం రేకుల షెడ్లు ఏర్పాటు చేస్తున్నారు. కానీ తమ కోసం కనీస సౌకర్యాలు కూడా ఏర్పాటు చేయడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజు వారీ వేతనాల్లో కూడా కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. ఎంత వేతనం వస్తుందో కూడా కూలీలకు తెలియని పరిస్థితి. ప్రధానంగా ఒరిస్సా, ఆంధ్ర ప్రాంతం నుంచి కూలీలు వచ్చి ఇటుక బట్టీలో పనులు చేస్తున్నారు. మధ్యవర్తుల ద్వారా ఇటుక బట్టీల్లో పని చేస్తున్నట్లు కార్మికులు తెలిపారు. ఒక్క ఇటుక బట్టీకి కూడా ఎలాంటి అనుమతులు లేవని రెవెన్యూ అధికారులు కుండబద్దలు కొడుతున్నారు. కానీ ఇంత వరకు ఎవరిపై చర్యలు చేపట్ట లేదు. ఉన్నతాధికారులు స్పందించి కార్మికుల హక్కులను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

పసుపు రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వాలు



సమావేశంలో మాట్లాడుతున్న శోభన్

ఆర్మూర్‌టౌన్: పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని, మద్దతు ధర కల్పిస్తామని ప్రకటించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను మోసం చేస్తున్నాయని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని మెడికల్ ఏజెన్సీ భవన్‌లో బుధవారం తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పసుపు క్వింటాలుకు రూ.5 వేలు మాత్రమే రావడంతో పెట్టుబడి కూడా చేతికి అందడం లేదన్నారు. పసుపు మద్దతు ధర రూ.15వేలుగా నిర్ణయించాలని, పసుపు బోర్డును ఏర్పాటు చేయాలని, స్పైసెస్ బోర్డు రీజనల్ కార్యాలయంతో రైతులకు ఎలాంటి ఉపయోగం ఉండదని అన్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి పసుపు బోర్డును ఏర్పాటు చేయటానికి ప్రయత్నం చేయాలని కోరారు.

టీచర్ మల్లికార్జున్‌కు న్యాయం చేయాలి



బోధన్ ఆర్డీవో ఆఫీసు ఎదుట నినాదాలు చేస్తున్న నాయకులు

బోధన్: కోటగిరి జెడ్పీహెచ్ ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌పై అవమానపరిచిన వారిని వెంటనే అరెస్టు చేయాలని, టీచర్‌కు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం పట్టణ కేంద్రంలోని ఆర్డీవో ఆఫీసు ఎదుట తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ ప్రతినిధులు ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారికి వినతి పత్రం అందించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు యేశాల గంగాధర్, నాయకులు లింగం, శ్రీనివాస్, దండు సాయిలు, షేక్ అజీమ్, శంకర్, నగేష్‌లు పాల్గొన్నారు.

తీవ్రంగా ప్రతిఘటిస్తాం

కోటగిరి: మల్లికార్జున్‌పై దాడికి నిరసనగా సీఐటీయూ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కేంద్రంలోని ధర్నా చేపట్టారు. ధర్నా అనంతరం సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి విక్రమ్ అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్ర శ్రీకాంత్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఇలాంటి దాడులు పునరావృతమైతే తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళులు

మాజీ ముఖ్యమంత్రి, సినీ నటుడు ఎన్టీ రామారావు వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పలువురు రక్తదానం చేశారు. ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా నాయకులు కొనియాడారు. – బాల్కొండ/బోధనరూరల్/వర్ని



బోధన్ కమ్మ సంఘంలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు



శ్రీనగర్‌లో ..

యువతులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ



మాట్లాడుతున్న స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ హిమజ

కోటగిరి: మండల కేంద్రంలోని శ్రీ శివసాయి కంప్యూటర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్‌లో నిరుద్యోగ యువతులకు స్వచ్ఛంద సంస్థ హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ (హైదరాబాద్) సంయుక్తాధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులను ఆ సంస్థ ఫౌండర్ హిమజ బుధవారం ప్రారంభించారు. 40 మందికి 35 రోజుల పాటు ఈ డిప్లొమా కోర్సులో శిక్షణ ఇవ్వనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ మహిళలకు స్థానికంగా ఉపాధి కల్పించాలన్నదే తమ సంస్థ ధ్యేయమని హిమజ పేర్కొన్నారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ రమేష్, స్థానిక శివ సాయి కంప్యూటర్స్ నిర్వాహకులు ఈశ్వంత్ రావు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ ఏర్పాట్లు పూర్తి



ఆచన్‌పల్లిలో కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి



మెండోరాలో కంటి వెలుగు డెమోను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

కంటి వెలుగు కార్యక్రమ ఏర్పాట్లను వైద్యాధికారులతో కలిసి బుధవారం ప్రజాప్రతినిధులు పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించామని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయటానికి వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. కంటి పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
–బోధన్ టౌన్/రెంజల్/బాల్కొండ/పెర్కిట్



రెంజల్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది



పెర్కిట్‌లో..దేగాం పీహెచ్‌సీ వైద్యాధికారిణి మానస